# సావిరహే

—మోహనవంశీ

మా కాలేజీలో ఆడపిల్లలు మగపిల్లలు ఫ్రీగానే వుంటామనే చెప్పాలి. నీరజ మరీ అందగత్తె కాకపోవడం చేత ఇంట్రావర్ట్‌గా తయారైందల్లే వుంటుంది. కాస్తో కూస్తో నేను మా కాలేజిలో యాక్టివ్ మెంబర్‌ననే చెప్పాలి. చదువు మాట ఎలా వున్నా క్రికెట్‌లో కప్పులు పరుగు పందెములో షీల్డులు సంపాదించాను. మా కాలేజీ కమిటీ వాళ్ళు ఆటల్లో పాల్గొనే మాలాంటి వారినుంచి ఫీజు వసూలు చేస్తారు. కనీసం వాళ్ళకు పదివేల రూపాయిల దాకా వస్తాయి. దానిలోంచి మాకు హరిదాసులు వాయించే చిరతలు లాంటి మూతలు గల వెండి కప్పులో, కాదు కూడదూ అంటే పనికిమాలిన కాగితము మీద పనికిరాని మాటలతో ఏవో అచ్చుకొట్టి సర్టిఫికెట్ రూపంలో యిస్తుంటారు. అంతేకాక ఏ జిల్లా కలెక్టర్ వారినో ముఖ్య అతిథిగా పిలవడంతో మేమంతా పుబ్బిపోయి వీటిలో పాల్గొని మా తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలంగా యీ కాగితమ్ముక్కలు, కప్పులు చిరతలు తీసుకువెళ్ళి ఇస్తాం. ముక్కూ, మొఖం ఒక్కరవ్వ అందంగానే వుండటం వల్ల కాస్త డాన్సు కూడా నేర్చుకున్నాను. దాంతో పాపం ఆ అమ్మాయికి నాకంటే హీరో మరి ఎవ్వరూ కన్పించలేదు కాబోలు, నేను తనకి ఎప్పుడు ఎదురుపడ్డా ఒక చిన్న కాగితంమీద "సావిరహే" అనే పదాన్ని రాసి నా ముందు పడేస్తుంటుంది. అలా మొత్తం మీద నా దగ్గర వంద కాగితాలు చేరివుండవచ్చు. తెలుగే రాని నాకు యీ సంస్కృత పదం ఏమిటో బోధపడక భాషాప్రవీణ చదువుతున్న ఒక స్నేహితుడి దగ్గరకు వెళ్ళి "ఈ పదం ఏమన్నా తిట్టడమో లేక పొగట్తో అసలు యీ పదానికి అర్థం ఏమిటో చెప్పు" అని అడిగాను.

అంతే వాడు ముప్పైయారు మెలికలు తిరుగుతూ కాగితాన్ని ముందు సవ్యంగా ఆ తరువాత తిరగేసి అన్ని ప్రక్కలనుంచి చూచి కళ్ళుతేలేసి ఆకాశము వంకచూచి "తవదీనా" అన్నాడు. అసలు "సావిరహే" అనే పదానికే అర్థం తెలియక చస్తూంటే యీ "తవదీనా" గొడవ ఏమిటో తెలియక వాడి వీపు మీద రెండిచ్చుకొని "ఏమిట్రా బాబు మూర్ఛరోగిలా యీ విధంగా అవుతున్నావు. ఇంతకి ఆ మాటలకి అర్థం ఏమిటో చెప్పి ఏడువు" అని అన్నాను.

"ఎంత అదృష్టవంతుడివిరా వంశీ! ఆ అమ్మాయి నిన్ను ప్రేమిస్తోంది" అన్నాడు వాడు. పుల్లనారింజ నోట్లో వేసుకున్న వాడిలా ముఖంపెట్టి అష్టవంకర్లూ తిప్పుతూ. "ఎవర్రా ఆ అమ్మాయి" అని కూడా అడిగాడు. అంతే ఒక గంతేసి వాడి మాటకు సమాధానం చెప్పకుండా పరుగు పందెంలో ప్రసిద్ధమైన నా కాళ్ళకు బుద్ధిచెప్పాను. ఆ అమ్మాయి భయంతో రెండురోజులు కాలేజి మొగమే చూడలేదు. ఏదైనా నోట్సు అడుగుతుందేమో అని అనుకున్నాను. కాని యింత అన్యాయమైన పని చేస్తుందని అనుకోలేదు. రెండు రోజులు కాలేజికి వెళ్ళక పోయేసరికి అగ్గిరాముడు లాంటి మా నాన్న విని వినపడనట్లు ఎత్తి పొడుపులతో ప్రారంభించి ఆంబోతులా రంకెలు వేయటం ఆరంభించాడు.

"వెధవా! నీకు చదువు వస్తుందని నేను ఏనాడూ అనుకోలేదు! ఆడంగి వెధవల్లాగ ఆ డాన్సు, చిరుతలా పరిగెత్తి పనికిమాలిన కప్పులు, పెద్దవీరుడిలా వెధవ చెడుగుడు లాంటి ఈ క్రికెట్‌లో దెబ్బలు తగిలించుకు రావడం, ఆసుపత్రుల వెంట తిరగడం...ఇంతకు మించి నీకు చదువు వస్తుందిరా? రాదు! రాదని తెలిసికూడా నిన్ను చదివించడం నాది బుద్ధి తక్కువరా. ఇంతకూ నీ మొహాన ఎలా రాసుందో అలాగే ఏడువు!! తుచ్ఛుడా! అప్రాచ్యుడా!!" అంటూ కందిరీగలా కుట్టడం మొదలెట్టేసరికి యీ తిట్లకన్నా ఆ అమ్మాయి "సావిరహే" రైటుని బిక్కు బిక్కుమంటూ కాలేజికి వెళ్ళాను.

అప్పటికే నాకోసం మూడు "సావిరహే"లు ఎదురు చూస్తూవున్నాయి. ఇన్నాళ్ళ నుంచి ఆ అమ్మాయి యిచ్చే "సావిరహే"లు పుచ్చుకోవడమే గాని ఏనాడు ఆ అమ్మాయి వంక పరీక్షగా చూడలేదు. ఆ అమ్మాయి అందవిహీనంగానే వుంటుంది. నాకు మనస్సులో జాలివేసింది. కాని నేనేమి త్యాగమూర్తిని కాను. ఆమెను వుద్ధరించడానికి. మళ్ళీ యీలోకం లోకి రాగానే నీరజ నాముందు ఆ మూడు "సావిరహే"లు పడేయగానే ఒక సుడిగాలి వచ్చి ఆ కాగితం ముక్కలు ఎగిరిపోయాయి. అందులో ఒక కాగితం ముక్క అప్పుడే ఎదురుగుండా వస్తున్న మా తెలుగు మాస్టారి కాళ్ళమీద పడింది. ఆయన దానిని ఆప్యాయముగా తీసుకొని దానిలో వున్న "సావిరహే"ను చదివి "ఒరేయ్" అని ఒక ఉరుము ఉరిమినట్లు నన్ను పిలిచారు. పారిపోవడానికి సిద్ధంగా వున్న నేను ఆయన పిలుపుతో యిక తప్పదని ఆయన దగ్గరికి వెళ్ళాను. "ఏమిట్రా యిది—అసలు యిది ఏమిటని అని అడుగుతున్నాను" అన్నారు మాస్టారు. ఆ కాస్త కాగితమ్ముక్కని జాగ్రత్తగా పట్టుకొని మా భాషాప్రవీణ మిత్రుడి వలన ఏదో సినిమాలో యీపాట ఒకటి వుందని తెలిసిన వాడినై, అంతేకాక అబద్ధం చెప్పాలంటే భయపడే నేను "పా--పా-- పాట మాస్టారు నే--నేర్చుకుందామని" అని అన్నాను, భయం భయంగా.

"ఒరేయ్ చంపేస్తా! ఈ దస్తూరీ నీది మాత్రం కాదు. నిజం చెప్పు—ఎవరిది వ్రాత" అని అన్నారు. ఇంక తప్పించుకుంటానికి మార్గంలేని నేను "అది కాదు మాస్టారూ! ఆపాట నాకు రాదు--మరి నీరజకు వచ్చంటేను------."

"ఎటుతిప్పి చూసినా రెండు అంగుళాలు లేని యీ కాగితంమీద అంత పెద్ద పాటని నీరజైతే మాత్రం ఎలా రాస్తుందిరా మిమ్మల్ని కాలేజికి పంపించింది చదువుకోమని గాని యీ "సావిరహే"లకి "తవదీనా"లకు కాదు. ఒకవేళ

ఆ అమ్మాయి నిన్ను ప్రేమించిందే అనుకో నువ్వు ఆమెను పెళ్ళిచేసుకోవటానికి సిద్ధంగా వున్నావా? ఇంటర్ క్లాస్ వెధవ్వి ప్రేమ అంటే ఏమిటో—తెలుసా? కాలేజి ఎగ్గొట్టి సినిమాలు చూడటం కాదురా ప్రేమంటే—ఆడపిల్లలను ఏడిపించడం కాదురా ప్రేమంటే—అయినా యీ వయస్సులో అలాగే అనిపిస్తుందిరా. బదుద్దాయి. కులాలు వద్దు, మతాలు వద్దు అంటూ స్టేజిలమీద వుపన్యాసాలు దంచటం కాదురా—అవి చేసి చూపించాలిరా, అయినా ప్రేమించటానికి ఆ అమ్మాయే దొరికిందిరా? రాస్కెల్ అంటూ పెద్ద ఉపన్యాసం యిచ్చేసారు. ఇంకా కొద్దిసేపు వుంటే కళ్ళుతిరిగి పడిపోతానేమోననిపించి ఒక్క పరుగున కాలేజి నుంచి కొంపకు చేరాను.



నాకు ప్రతిరోజు సాయంత్రము బీసెంట్ రోడ్డు దాక నడిచి వెళ్ళడం అలవాటు. ఆరోజ కూడా అలవాటు చొప్పున బయలుదేరాను. ఇంతలో నా కాళ్ళకు బ్రేకులు పడ్డాయి. ఎందు వలనంటే ఎవరి వలన రెండురోజులు కాలేజి మానేసి మానాన్నగారి చేత తిట్లు తిన్నానో ఎవ్వరిగురించి ప్రొద్దున తెలుగుమాస్టారితో శాపనార్ధాలు తిన్నానో సదరు ఆ మహాతల్లి నీరజగారు యిప్పుడు నాముందు వున్నారు. ఇదేమిటో గాని యీ మధ్య యీ అమ్మాయికి విపరీతంగా దొరికి పోతున్నాను. అని అలోచనలతో వుండగా నీరజ పిలుపుతో యీలోకంలోకి వచ్చాను.

“ఏమండీ, తెలుగు మాస్టారు మిమ్మల్ని బాగా తిట్టినట్టున్నారు” అని అన్నది నీరజ.

“చూడండి మిస్, ఆయన తిట్టక ముద్దుపెట్టుకుంటారా మీరు చేసిన పనికి. అయినా నేను సగటు సామాన్య యువకుడిని, అసమర్దుడ్ని పైగా మా నాన్నగారి అదుపాజ్ఞల్లో వున్నవాడిని. మీరు నాకిచ్చిన “సావిరహే”లు యిప్పటికి హోటల్లో బిల్లు పుస్తకాలంత సైజ్‌లో తయారయ్యాయి. ఇక మన కలయిక సాధ్యము కాదు. దయచేసి మీరు నన్ను వదిలేరా” అని అన్నానో లేదో—

“ఏమైనా ఆడది కోరివస్తే మీ మగవాళ్ళకు లోకువ. మీ మగబుద్ధిని పోనిచ్చుకోలేదు. మీరు ఒట్టి స్వార్ధపరులు” అంది నీరజ. ఇంతకీ ఆ డైలాగ్ ఏ రచయిత్రి నవలలోదో నాకు అర్ధం కాలేదు. నేను కూడా అదే ధోరణిలో “మీరు నన్ను అపార్ధం చేసుకుంటున్నారు నీరజగారు” అని అన్నాను.

“ఏమండీ! నేను మిమ్మల్ని అపార్ధం చేసుకోవడం లేదు. మొదటిరోజు అదే మనం కాలేజీలో జాయిన్ అయినరోజు మిమ్మల్నికాలేజి లో చూడగానే నాలో ఏదో చెప్పలేని సంచలనం కలిగింది. నాకు కులం తక్కువే కావచ్చు. డబ్బు లేకపోవచ్చు. మీరు కోరుకునే అందం లేకపోవచ్చు. అయినా ప్రేమించే హృదయం వుంది. కాని ప్రేమకి డబ్బు, అందం కులంతో పని ఏముంది? ప్రేమ మనస్సుకు సంబంధించినది. మీరు అనేక సినిమాలలో ప్రేమ గొప్పతనాన్ని గురించి------.”

ఆ తరువాత మాటలు నాకు వినిపించడం లేదు, కారణం దూరంగా మా నాన్నగారు కూరగాయల సంచితో వస్తూ కనిపించారు. తన కుమారుడు శ్రీరామచంద్రమూర్తి లాగా

వుండాలని ఆయన తాపత్రయం. అయినా మార్కెట్ మాయింటి దగ్గరే వుండగా ఆయన యింతదూరం ఎందుకొస్తున్నాడబ్బా! అయినా నాకెందుకు ముందు యిక్కడి నుంచి తప్పుకుంటే మంచిది. లేకపోతే ఆయన పంచాగం విప్పేయగలరు అని వేగంగా ప్రక్కవీధిలోకి పరారయ్యాను. పాపం నీరజకు ఒక్కమాటైనా చెప్పకుండా వచ్చేసాను. అయినా ఆమెకేం తెలుసు మా నాన్నగారి గురించి?

ఆ తరువాత నీరజ కాలేజిలో ఎదురుపడ్డా తన గురించి అంతగా పట్టించుకోవడం మానేసాను.

కాని నీరజ దృష్టిలో నన్ను పనికిమాలినవాడుగా భావించివుంటుంది. పీత కష్టాలు పీతవి అన్నట్లు పితాజీ కష్టములో వున్న నన్ను ఆమె అపార్థం చేసుకొని వుంటుంది. అంతేకాక కనిపించి నపుడల్లా నన్ను చీదరించుకోవడం, అసహ్యంగా ముఖం పెట్టడం చేస్తుంది. అంతేకాక ప్రక్కనున్న స్నేహితురాళ్ళతో "ఒసేవ్! పెద్ద అందగాడిలా ఫీలవుతున్నాడే మొహం చూడు మొహం! ఈయనే యీ కాలేజికి పెద్ద హీరోలా ఇంకెవ్వరూ లేనట్లు--."

ఈలాంటి మాటలతో నా మనస్సుని బాధపెట్టసాగింది. ఆమె ఎందుకిలా ప్రవర్తిస్తూందో నాకు అర్థం కావడం లేదు. మొదట్లో తనంటే యిష్టంలేకున్నా నీరజ అందవిహీనంగా వున్నా మనస్సు మంచిదని ప్రేమించుదా మనుకున్నా. కాని నీరజ మనస్సు కూడా యింత అంద విహీనంగా వుంటు ందనుకోలేదు. నా డిగ్రీ కూడా పూర్తి అవడంతో కాలేజి మానేయడంతో కాలక్రమేణా ఆమె నా మనస్సులోంచి తొలగి పోయిందనే చెప్పవచ్చు.

పెద్దకులం వాడిని కనుక వుద్యోగం వస్తుందని ఆశలేదు. కనుక వ్యాపారంలో దిగిపోయాను. ఇలా ఒకటి రెండేళ్ళు అయిన తరువాత నేనొక పెద్ద రచయిత పుస్తకం ప్రచురించాను. ఆ పుస్తకం నాకు మంచి లాభాలు తెచ్చింది. ఒకనాడు ఆ రచయిత తన అభిమాన పాఠకురాలి పుస్తకం ప్రచురించమని రికమెండ్ చేశాడు. ఆయన వల్ల నాకు లాభాలు రావడం వల్ల ఒప్పుకోక తప్పలేదు. ప్రతి రోజులాగానే ఆరోజు కూడా మా నాన్నగారు కాష్‌కౌంటర్లో వున్నారు. అలాంటి ఒక సాయంత్రం కాలేజీలో మొదటి ప్రేమికురాలుగా తరువాత శత్రువుగా మారిన నీరజ మా రచయితతో షాపులోకి వచ్చింది. ఆమెని చూడగానే గుండె వేగంతో కొట్టు కోవడం ప్రారంభించింది. కొంపదీసి మా రచయిత ప్రచురించమన్న కథ యీ రచయిత్రిదేనేమో. ఏ మూడ్‌లో వున్నారో గాని మా నాన్నగారు ఆమె రచన ప్రచురించడానికి ఒప్పుకున్నారు. మా నాన్నగారు మామూలుగా అందరినీ అడిగినట్లు "నీ పేరేమిటమ్మా" అని అడిగారు. వెంటనే ఆమె "నా పేరు నీరజ అండి" అని అన్నది. అంతే మా నాన్నగారు ఏమీ మాట్లాడకుండా అక్కడ నుంచి లేచి వెళ్ళిపోయారు. అలా కారణం లేకుండా వెళ్ళిన మా నాన్నగారికి కొంపదీసి మా యిద్దరి మధ్య జరిగిన కథ తెలిసిందేమో అని అనుకుంటు ండగా మా రచయిత నీరజను నాకు పరిచయం చేశారు. నేను మామూలుగా నమస్కారం చేశాను. అప్పుడే నన్ను చూసిన నీరజ వులిక్కిపడి ఆపై అసహ్యంగా మొహంపెట్టి నన్ను కిరాతకుడిలాగ చూస్తూ,

ఇంతకంటె మంచి పబ్లిషర్ ఎవరూ దొరకలేదా! ముందే చెప్తే వేరే పబ్లిషర్‌ను చూసుకొనేదాన్నిగా" అని విసురుగా తన పుస్తకం లాక్కొని అక్కడినుండి విసవిస నడుచుకొంటూ వెళ్ళిపోయింది. విసురుగా పుస్తకం లాగడంలో టైటిల్ కాగితం వూడి క్రింద పడింది. మా రచయిత క్రిందపడిన ఆ టైటిల్ కాగితం తీసుకొని నా చేతికిచ్చి ఏమీ అర్థంకాక "ఈ ఆడవాళ్ళ మనస్సు ఎప్పుడు ఏ విధముగా వుంటుందో ఎవరికి అర్థంకాదు' అని అక్కడ నుండి వెళ్ళిపోయారు. ఆ కాగితాన్ని అందుకొని ఆమె రాసిన పుస్తకం పేరు చూసిన వెంటనే నా కళ్ళలో నీరు గిర్రున తిరిగింది. "సావిరహే" అనే యీ నాలుగు అక్షరాలు నాలుగు ముళ్ళలా కన్పించసాగాయి. ఆ తర్వాత నీరజ గురించి యింకే విషయాలూ తెలియలేదు. అసలు ఆమె ఏమైందో కూడా తెలియలేదు. అలా తెలియక పోవడమే మంచిదనిపించింది. ❋

# ఇంటిపేర్లు

**మా యింటిపేరు ఎలా వచ్చిందంటే—**

ఈ శీర్షికలో మీరూ పాల్గొని మీ యింటిపేరు ఎలా వచ్చిందో చెప్పండి. మీకు తెలీకపోతే మీ పెద్దల్ని అడిగి చూడండి.

ఇంటి పేర్ల శీర్షికకు వ్రాసిన పాఠక లోకానికి ఒకొక్కరికి— 'కన్యాశుల్కం' కాపీ బహూకరిస్తాము.

మీ వ్యాసాన్ని ఇన్‌లాండ్ లెటర్‌లో వ్రాసి మీ పూర్తి చిరునామాతో,

ఇంటిపేర్లు
ఆంధ్రజ్యోతి
సచిత్ర వారపత్రిక
విజయవాడ–10

కి వెంటనే పంపించండి!

మీ ఇంటిపేరు మీ 'రూట్సు'ను సూచిస్తుంది.

